
# తెలుగు దేవో భవ!




- నారాయణ పి.వి.వి.ఎస్

ఉగాది పోటీలో ఎంపికైన కథ

"అమ్మా...! నీకెన్నిసార్లు చెప్పాను స్వప్నతో గొడవ పెట్టుకోవద్దని?"

పార్వతమ్మ విస్తుపోయి చూసింది కొడుకు మూర్తిని. ఆమెకి నోట మాట పెగల లేదు.

నెమ్మదిగా తేరుకొని 'గొడవ పెట్టుకున్నానా... అదీ స్వప్నతోనా... ఎప్పుడు' అని అడిగింది.

'ఆ వివరాలన్నీ అవసరమా?' విసుగ్గా అడిగాడు మూర్తి.

'మా మధ్య గొడవేమిట్రా? అటువంటిదేం లేదే!'

'నువ్వన్నీ ఇలాగే మాట్లాడతావ్! స్వప్న ఏడుస్తోంది.'

'ఉదయం నీ కొడుకు సంజు కథ చెప్పు మామ్మా అని అడిగితే వాడ్ని, మానసని నా గదిలో కూర్చోపెట్టి కథ చెప్తున్నాను. స్వప్న వచ్చి పనికిమాలిన విషయాలు చెప్పి వాళ్ళ మనసుల్ని పాడుచేయకండి అని అంది. పంచతంత్రం కథలు పనికిమాలినవా అని అడిగాను. ఆమె తన పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోయింది. అంతే. ఇందులో గొడవపడిందేముంధని? ఈమాత్రం దానికి స్వప్న ఎందుకు ఏడ్వాలిట!' అంది పార్వతమ్మ-

'నీకు అన్నీ చిన్న విషయాలుగానే కనిపిస్తాయి. మీ ఇద్దరికీ చెప్పలేక నాకు చావొచ్చింది' అంటున్న కొడుకుకు ఏమీ చెప్పలేక కంట్లో కదలాడుతున్న కన్నీటిని బయటకు రానివ్వకుండా ప్రయత్నిస్తూ మౌనంగా నేల చూపులు చూస్తూ కూర్చుంది.

తల్లిని అలా చూసేసరికి మూర్తికి బాధ కల్గింది. ఆమె ఎంత కష్టపడి తననింతవాడ్ని చేసిందో అతనికి గుర్తులేక కాదు. కుర్చీలోనుండి లేచి మంచం మీద తల్లి ప్రక్కన కూర్చుని ఆమె భుజం మీద ఆప్యాయంగా చెయ్యివేసి అన్నాడు.

'అమ్మా! స్వప్న సంగతి నీకు తెలుసు. మీ ఇద్దరిలో ఎవ్వరూ నాకు తక్కువ కాదు. పెద్ద దానివి. కన్నతల్లివి. నువ్వు అర్థం చేసుకోబోతే ఎలా?'

కొడుకు ఆప్యాయంగా మాట్లాడేసరికి ఆ మాతృమూర్తి హృదయం కదిలిపోయింది. కొడుకు ముఖాన్ని తన చెంపలకు ఆనించుకుని 'పోన్లేరా నాన్నా! అది చిన్న పిల్ల. మనుమల చదువు గురించి ఇకపైన నేను కల్పించుకోను సరేనా' అంది.

'నీ సంగతి నాకు తెలుసమ్మా. నీకేం కావాలన్నా తెచ్చిపెడతాను. తెలుగు ఛానల్స్ చూడు. తెలుగు పుస్తకాలు చదువుకో. కాని పిల్లల దగ్గర ఈ తెలుగు ప్రస్తావన తేవద్దు. సరేనా' అన్నాడు.

'వెర్రి నాన్నా అంతగా చెప్పాలా! కాని ఆ పిల్లలు నా దగ్గరకొచ్చి కథలు చెప్పమని అడుగుతున్నారు. వాళ్ళు నా దగ్గరకు రాకుండా చూసుకో సరేనా...'

'అలాగే... ఇక్కడ మనం అమెరికాలో సెటిలైపోయాం. ఆ తెలుగు భాష, సాంప్రదాయాలతో పనేమిటి చెప్పు.'

'స్వప్న మొదటి నుండి చక్కగా తెలుగు మాట్లాడేది కదరా! అమెరికా వచ్చాకా ఈ తెలుగు అలర్జీ ఏంటిరా పాపం. ఇంట్లో నాతో కూడా ఇంగ్లీషులోనే మాట్లాడాలా?'

'దాని పిచ్చి దానికి ఆనందం అనుకో...'

'అంతే... అంతే... అయినా... నాన్నా... అమెరికాలో స్థిరపడితే మన భాష, అలవాట్లు మార్చేసుకోవాలా? ఇక్కడ అమెరికాలో అలా ఏదైనా రూల్స్ ఉన్నాయా?' అమాయకంగా ముఖం పెట్టి అడిగింది పార్వతమ్మ.

'లేవనుకో...' నీళ్లు నమిలాడు మూర్తి.

'మొన్న మన తెలుగు అసోసియేషన్ వాళ్ళు తెలుగు పద్యాలు, శ్లోకాలు చెప్పిన వారికి బహుమతులు ఇచ్చారు. తెలుగు నాటకాలు వేశారు. ఇక్కడ తెలుగువాళ్ళకోసం ఏమేమో చేస్తున్నామని చెప్పారు.'

'వాళ్ళిచ్చే గిఫ్ట్స్ ఏం చేసుకుంటాం? వేదికలెక్కి ఏమేమో చేస్తామనే చెప్తారు. అవన్నీ మాటలకే... జరిగే పనులు కావమ్మా...'

'అంతేనా... మరి దానికి నువ్వేదో జాయింట్ సెక్రటరీ గట్రా...' చిరు మందహాసంతో అంది పార్వతమ్మ.

'ఏదో ఒకటిలే... మన ఉనికిని చాటుకోడానికి... ఈ పోర్టుఫోలియోలు బలవంతంగా మన మీద రుద్దుతారు. మనం కూడా ఆ సమయంలో అలాగే మాట్లాడతాం...'

'ఓస్. నేనింకా ఏమో అనుకున్నాను. కొంకాపల్లిలో ఉంటే నీకు ఇన్ని తెలివితేటలు వచ్చేవి కావేమో! ఎంత ఎదిగిపోయావురా!' అంది పార్వతమ్మ నవ్వుతూ.

మూర్తి తల్లి ముఖంలోకి అనుమానంగా చూసాడు ఆమె మాటల్లో సెటైర్ లేదు కదా అన్న ఫీలింగ్‌తో!

'నువ్వు చెప్పేది నిజంరా నాన్నా... బిఎ రోమన్ ఇన్ రోమ్ అన్నారుగా పెద్దలు. అమెరికాలో ఉన్నపుడు తెలుగువాడైనా సరే... అమెరికన్‌గా జీవించాల్సిందే!' మూర్తి మౌనంగానే లేచాడు తల్లి మాటల్లోని అర్థాలని వెతుకుతూ.

* * *

పార్వతమ్మ ఈవినింగ్ వాక్ పూర్తిచేసుకుని లాన్‌లో కూర్చుంది. విశాలమైన పార్కులో... ఒక ప్రక్క మనశ్శాంతినిచ్చే దేవాలయం మరో ప్రక్క ఆరోగ్యాన్నిచ్చే యోగా కేంద్రం! తెలుగువాళ్ళు నిర్మించిన పార్కు ఇంటికి సమీపంలోనే ఉంది. రోజూ వాకింగ్‌కి వచ్చే పార్వతమ్మ ఆరోగ్యం కోసం మాత్రమే కాకుండా అక్కడికొచ్చే వందలాది తెలుగు వాళ్ళని కలవడానికి కూడా! వారిలో దాదాపు అందరితో పరిచయం ఉందామెకు. వాళ్ళు తనను ఆప్యాయంగా పలకరించి వెళ్తాంటే ఎంతోఆనందిస్తుందామె.

ఎక్కడి ఆంధ్రప్రదేశ్!

ఎక్కడి అమెరికా!!

ఎక్కడి కోనసీమ!!

ఎక్కడి న్యూజెర్సీ!!

అమలాపురం సమీపంలోని కొంకాపల్లిలో ఒక స్కూలు టీచర్ భార్యగా బ్రతికిన పార్వతమ్మకు దేశంకాని దేశంలో సుదూరంగా బ్రతకగలగడానికి కారణం... ప్రపంచమంతా మనదే అనే భావన!

నిజానికి పార్వతమ్మ జీవితం-

- పచ్చని పంట పొలాల నుండి పార్కుల జీవిత్నికి మారింది!
- చల్లని పెంకుటిళ్ళ నుండి ఆకాశహర్మ్యాల మధ్య ఇరుక్కుంది!!
- నదీనదాలతో ఉన్న అనుబంధం కలర్‌ఫుల్ ఫౌంటెన్స్‌తో పెనవేసుకుంది!
- కొబ్బరి చెట్ల నీడల నవ్వారుమంచాల పడక నాలుగు గోడల మధ్య బోన్‌సాయ్ మొక్కల ప్రక్క కుషన్ పరుపు పాలయింది!!

తెల్లారితే కనిపించే ఇరుగు పొరుగుల పలకరింతల పులకరింతలు కరువైపోయాకా ఎంత సంపాదిస్తే ఏం

ప్రయోజనం!

వీకెండ్ హాలిడేస్ ట్రిప్పులను మరిగిన జీవితాలను కార్తీక మాసపు వన భోజనాల ఆనందం ఎలా గుర్తొస్తుంది! ఒక్క గానొక్క కొడుకుని మనుమలని దూరం చేసుకుని బిక్కు బిక్కుమంటూ ఒంటరి జీవితాన్ని గడపడం ఇష్టం లేక, తాతయ్య ఎలానూ లేరు కనీసం నానమ్మ ప్రేమని కూడా దూరం చేయడం నచ్చక కొడుకుతో అమెరికా వచ్చేసింది ఆరునెల్ల క్రితం! ఆ నేలతో ఏభై ఏళ్ళ అనుబంధం!

ఆ గాలితో, ఆ నీళ్ళతో, ఆ మనుష్యులతో సంబంధం కొద్ది గంటలలో తెగిపోయి ఎగురుకుంటూ వచ్చేసింది!

అయితే- వీళ్ళు మాత్రం మనుషులు కారా! ఇక్కడ మాత్రం జీవించలేమా అనుకుంది! తీరా వచ్చాకా వందలాది తెలుగు వాళ్ళని చూసాకా పార్వతమ్మ ఆశ్చర్యం రెట్టింపైంది.

వాళ్ళు దీపావళి, దసరా సరదాలకు దూరం కాలేదు. గంటల పంచాంగాలను తెప్పించుకుని తిథి వార నక్షత్రాలను తమకు చేతనైనంతలో చూసుకునే పనులు చేసుకుంటున్నారు. దేవాలయాల నిర్మాణాలు, పండుగ సందర్భాలలో కలయికలు బాగానే వున్నాయి... కాస్త ఆధునికతతో ముడిపడి!

ఆ లెక్కన ఇండియాలో మాత్రం ఎన్ని మార్పులు రాలేదు!

కట్టు, బొట్టు, మాట, మంతీ అన్నిటిలోను ఆధునికత చేరిపోయి తెలుగు జీవితాలను మార్చలేదా?

ఇంక విదేశాలలో గురించి ఆలోచించడం వృథా!

"ఏ దేశంలో వున్నామనే కంటే ఎలా ఉన్నామన్నదే ముఖ్యంరా! అమెరికాలో ఉన్నప్పటికీ మాతృభాషని, సంస్కృతి సాంప్రదాయాలను వదులు కోవాల్సిన పని లేదు!"

మూర్తిని అమెరికాకు పంపేటప్పుడు భర్త చెప్పిన మాటలు పార్వతమ్మ చెవిలో ఇంకా వినిపిస్తూనే వున్నాయి!

ఈ అమెరికాలోనే... సనాతన భారతీయ సాంప్రదాయతని పెనవేసుకుని బ్రతకడం అసాధ్యమా?

తన కొడుకు, కోడళ్ళలోని మార్పుకు కారణం ఏమిటి?

ఇన్నేళ్ళ తమ పెంపకం విలువ, నడమంత్రపు సిరిలా మధ్యలో వచ్చిన 'వ్యామోహం' ముందు వెలవెలపోయిందా?

ఎక్కడుంది లోపం?

చిన్నగా నిట్టూర్చింది పార్వతమ్మ.

జీవితం పెద్ద పాఠశాల!

ప్రతీ వ్యక్తి అందులో చదువరే!!

చదివే ప్రతి పాఠం ఎదురయ్యే ఒక అనుభవమే!

నేర్చుకొనే అనుభవం ఒక్కొక్క మార్పుకు ఆలంబనమే!

మార్పు కోరుకుంటే రాదు! అనుభవం వలన వస్తుంది!

మరి తన కొడుకు కోడళ్ళలో వచ్చిన మార్పుకు ఏ అనుభవం కారణమైంది!

పార్వతమ్మ తన కోణంలోకాక వాళ్ళ కోణంలో ఆలోచించడానికి ప్రయత్నిస్తోంది! అది ఆమె తీసుకోబోయే ఒక చక్కని అద్భుతమైన పనికి శ్రీకారం చుట్టింది.

* * *

'ఏమయ్యా వంశీ! ఇండియా నుండి ఎప్పుడొచ్చావు?' పార్వతమ్మ నవ్వుతూ పలకరించింది ముప్పై ఏళ్ళ యువకుడిని.

అతను వినయంగా 'నిన్ననే టీచర్!' అన్నాడు.

వంశీది కోనసీమలోని పుల్లేటికుర్రు. తండ్రి మోతుబరి. రాజకీయంగా పలుకుబడి, బోల్డంత ఆస్తి సంపాదించాడు. కొడుకుని అమెరికాకు పంపడం అతని లక్ష్యం. వంశీ రెండేళ్ళ క్రితం వచ్చి ఇక్కడే వున్న భారతీయుల అమ్మాయినే పెళ్ళిచేసుకుని డాక్టర్‌గా సెటిలైపోయాడు. ఇండియాపై మమకారం ఎక్కువ! ప్రతీ ఏటా మాతృ దేశపు వాసనల్ని నెల రోజులపాటు పీల్చుకుని వస్తాడు.

'బొజ్జ బాగా తగ్గిందే! ఇండియాలో కూడా ఎక్సర్‌సైజులు బాగా చేశావా?'

'రోజూ పొలాల మధ్య తిరిగితే ఇంకెక్కడి బొజ్జ టీచర్... హుష్‌కాకి' అన్నాడు నవ్వుతూ. వంశీ విశ్వనాథం మాస్టారు శిష్యుడే! అందుకే పార్వతమ్మని టీచర్‌గానే సంబోధిస్తాడు.

'టీచర్! తాపేశ్వరం కాజా, ఆత్రేయపురం మామిడి తాండ్ర, రాజమండ్రి పాలకోవ తెచ్చాను. సాయంత్రం ఇంటికొచ్చి ఇస్తాను.'

'మానాయనే? తిని చాలాకాలం అయింది. అవునూ... మన గంటివారబ్బాయి ఇక్కడ కొస్తున్నాడని తెలిసింది.'

'వచ్చేవారం వస్తున్నాడు టీచర్!'

'ఇక్కడ మన కోనసీమ వాళ్ళ సంఖ్య బాగా పెరిగింది వంశీ!'



'ఇక్కడేమిటి టీచర్! ప్రపంచంలో తెలుగువాడు లేని ఊరు ఏముంది?'

'బాగా చెప్పావు. అది సరే గానీ నీ సాయం కావాలి నాన్నా!' ప్రక్కనే కనిపించిన బెంచ్ మీద కూర్చుంటూ అడిగింది పార్వతమ్మ.

'మీకు నేను సాయం చెయ్యడమేమిటి టీచర్! ఆర్డర్ వెయ్యాలి' అన్నాడు వంశీ వినయంతో నిలబడి.

'మంచిది. ఆమధ్య తెలుగు నేర్పే వాళ్ళు కావాలని ఎవరో అడిగారన్నావు'.

'అవునవును. మీరు సంజుకి, మానసకి చెప్తొంటే విన్నారట! మిమ్మల్ని చెప్పేలా ఒప్పించమని నన్ను తినేస్తున్నారు. ఇండియాకి వెళ్ళాకా నే బతికాను. మళ్ళీ వచ్చాగా. మొదలవుతుంది. ఏం టీచర్! మీరు చెప్తారా?! ఆసక్తిగా అడిగాడు వంశీ.

'అవును. నిన్న మన తెలుగువాళ్ళని కలిసాకా నాకు కొన్ని ఆలోచనలు వచ్చాయి. ఈ ట్యూషన్‌వల్ల వచ్చే తృణమో పణమో...' ఆమె మాటలకు వంశీ అడ్డొచ్చాడు.

'తృణమో పణమో ఏంటి టీచర్? డాలర్ల వర్షం కురుస్తుంది. ఇక్కడున్న తెలుగు వాళ్ళందరూ తమ పిల్లలకు తెలుగు చెప్పేవాళ్ళకోసం కళ్ళు కాయలు కాచేలా చూస్తున్నారు. మీరు ఒప్పుకుంటే చాలు. నా నెత్తిమీద భారం దింపిన వారవుతారు. ఫీజులు విషయం నే మాట్లాడతాను. మీరు ఓకే కదా!'

పార్వతమ్మ నవ్వుతూ 'ఓకేనే! కాని ఎక్కడ చెప్పాలి? ఇంట్లో వీలుకాదని మా కోడలు నిష్కర్షగా చెప్పేసింది' అంది.

'నో ప్రాబ్లమ్ టీచర్. విషయం నాకు వదిలేయండి. రోజూ నేను కారు పంపిస్తాను. ముందు మా అమ్మాయితో కలిపి ఆరుగురు రెడీగా వున్నారు. అందరూ చిన్న పిల్లలే! మీకు ఇబ్బంది ఉండదు.'

'నాకు ఇబ్బంది ప్రసక్తి లేదు. మాస్టారి పేరు శాశ్వతం కావాలి. అది నా ఆశ!' అంది పార్వతమ్మ. తర్వాత తన ఆలోచనల్ని అతని ముందు విప్పి చెప్పింది.

* * *

పార్వతమ్మకి తన పదిహేనవ ఏట విశ్వనాథం మాస్టారితో పెళ్ళయింది. ముప్పై ఏళ్ళ కాపురంలో ఆమె భర్తకి అన్నిటిలో చేదోడు వాదోడుగా ఉండేది. తను చదివింది హైస్కూలు వరకే అయినా భర్తతో కలిసి ట్యూషన్లు చెప్పడంలో సాయపడేది. గణితం, ఆంగ్లం బోధించడంలో భర్తకి జిల్లాలోనే మంచి పేరుండేది. ట్యూషన్లకి ఎంతో మంది వచ్చేవారు. ఎవరేమిస్తే అది పుచ్చుకుని ట్యూషన్ చెప్పేవారు. ఇవ్వకపోతే అడిగేవారు కాదు. పేద విద్యార్థులకైతే తనే పుస్తకాలు కొనిచ్చి ఫీజులు కట్టి చదివించేవారు.

తెలుగు భాషంటే ఆయనకి వల్లమాలిన ప్రేమ. తెలుగు సాహితీ సమావేశాలు జిల్లాలో ఎక్కడ జరిగినా వెళ్ళేవారు. కవితల పోటీలు, కవి సమ్మేళనాలు నిర్వహించేవారు. ఎక్కడ పుస్తకం కనిపిస్తే అది కొని చదివి భార్యకి, కొడుకుకి, తన విద్యార్థులకి చెప్పేవారు.

ఒక సాహితీ సంస్థని స్థాపించారు. ఒక పత్రికని నడిపేవారు.

ఆయన ఏ పని చేసినా మొట్టమొదటి శ్రోత, పాఠకురాలు, కార్యకర్త పార్వతమ్మే!

అన్ని పనుల్లోను ఆమెనికూడా త్రిప్పుకునేవారు.

క్వాలిఫికేషన్ మాట పక్కన పెడితే భార్యని ఆంగ్లంలో, గణితంలో, తెలుగులో తనంత స్థాయికి పెంచారాయన.

కాణీ కట్నం తీసుకోకుండా కొడుకుకి తనతో పనిచేసే టీచర్ కూతుర్నిచ్చి పెళ్ళి చేసారు.

స్వప్న కూడా ఆయన శిష్యురాలే! లెక్కల ట్యూషన్‌కి ఆయన దగ్గరకొచ్చేది. అప్పుడే ఆ అమ్మాయి వినయ విధేయతలు, సాంప్రదాయం నచ్చిందాయనకు. కొడుకుని తెలుగు పండిట్‌ని చేద్దామనుకున్నారు. కాని డాక్టరవుతానంటే తన అభిప్రాయాన్ని కొడుకుపై రుద్దలేదు. మెడిసిన్ చదివించారు. స్వప్నని కొడుకు ఇష్టపడుతున్నాడని తెలిసి ఇద్దరికి పెళ్ళిచేశారు.

ఏనాడు ఏ విద్యార్థిని ఆయన కొట్టలేదు. ఎంతో సహనంగా నచ్చచెప్పేవారు. పదవీ విరమణ చేసిన మరునాడే గుండె నొప్పితో మరణించారు.

విదేశీ వ్యామోహంతో ఉన్న కొడుకు, కోడలు తండ్రి పోయిన మూడోరోజుకి చేరుకున్నారు అమెరికా నుండి.

కొడుకు పట్ల ప్రేమ...!

మనుమలకునానమ్మగా పెద్ద దిక్కు కావాలని కోరిక!

పార్వతమ్మని ప్రేరేపించాయి. ఆస్తుల్ని అమ్మేసి కొడుకుతో అమెరికా వచ్చేసింది!

"నా మనుమలికి భారతం, రామాయణం, భాగవతం, పంచతంత్రం కథల్ని చెప్తాను. నాట్యం సంగీతం నేర్పిస్తాను. సాహితీ వేత్తలుగా, బహుముఖంగా వాళ్ళని మేధావులుగా చేస్తాను! వాళ్ళని తెలుగుతనానికి దూరం చెయ్యనివ్వను పార్వతీ!" భర్త ఎన్నోసార్లు సంబరంగా, ఆవేదనగా చెప్పిన మాటల్ని రితలుచుకుని కళ్ళు తుడుచుకుంది.

మూర్తి, తన సుపుత్రుడు తండ్రి ఒళ్ళో కూర్చుని శతక పద్యాలు, పురాణాలు, భేతాళ కథలు, పంచ తంత్రం, విక్రమార్క, సహస్ర శిరచ్ఛేద చింతామణి కథలు ఒకటేమిటి ఎన్నెన్నో నేర్చుకున్న జ్ఞానాన్ని నిర్వీర్యం చేసి కేవలం ధన సంపాదన అనే ధ్యేయానికే అంకితం అయిపోవడం పార్వతమ్మ భరించలేకపోతోంది!

* * *

'విశ్వనాథం స్కూల్ ఆఫ్ లెర్నింగ్!'

న్యూజెర్సీలోనే కాక, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని తెలుగువారికీ, భారతీయులకు, భారతీయ కళలను అభిమానించే ఎందరికో కల్పతరువైంది!

**(మిగతా 12వ పేజీలో)**

# మృత్యు బిలం

మేధావులకు శాస్త్రవేత్తలకు అర్ధంకాని వింతలు విశేషాలెన్నో ఈ భూమి మీద ఉన్నాయి. అలాంటిదే ఈ మృత్యుబిలం కథ.

అమెరికాలో అర్కన్‌సాస్ రాష్ట్రంలో బూన్‌కౌంటీకి చేరువలో సెల్ఫ్ అనే ఊరుంది. ఇక్కడ ఒక ఇంటిలో నేలమీద రెండడుగుల లోతులో ఒక గొయ్యి ఏర్పడింది. అదెలా ఏర్పడిందా అని ఇంటి యజమాని ఆలోచిస్తుండగానే ఆ గొయ్యి మరింత లోతు అయింది. అడుగు ఎక్కడుందో , అసలా గొయ్యి ఎంత లోతుందో తెలుసుకోవడం కోసం ఆయన ప్రయత్నించాడు. అప్పుడు మొదలైంది అసలు కథ. ఇంటి పక్కనున్న ఓ పెద్ద చెట్టుకు తాడు కట్టి రెండో చివర తన నడుముకు కట్టుకొని నెమ్మదిగా ఆ గోతిలోకి దిగ సాగాడు ఇంటి యజమాని. దాదాపు తొంభై తొమ్మిది అడుగులు కిందికి వెళ్ళాక భయంకరంగా ఎవరో బుసకొడుతున్న శబ్దం వినిపించి ఆయన కంగారు పడ్డాడు. అంతలోనే దడదడ లాడుతూ భూకంపం వస్తున్నట్లు తన మీదకు ఎవరో వస్తున్నట్లు అనిపించడంతో భయంతో వణికిపోతూ బయటకు వచ్చేశాడు.

ఇరుగుపొరుగు వాళ్ళకి ఈ విషయం తెలియడంతో వారు ఈ గొయ్యి సంగతేంటో చూడాలనుకున్నారు. కొందరు ఉత్సాహవంతులు ఓ గునపానికి తాడుకట్టి వదిలారు. గునపం కూడా సరిగ్గా 99 అడుగుల లోతుకు చేరే సరికి మళ్ళీ భయంకరమైన శబ్దం వినిపించింది. అంతే కాకుండా లోపల్నుంచి తాడు పట్టుకొని ఎవరో లాగుతున్నట్టు కూడా అనిపించడంతో అదిరిపడి తాడును గబగబా పైకి లాగేశారు. తాడుకు కట్టిన గునపాన్ని చూసి ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టారు. గోతిలోకి దింపిన ఆ గునపం అష్టవంకర్లు తిరిగిపోయి ఉంది. దానిమీద అనేక గీతలు పడ్డాయి. అంత లావున్న గునపం అలా ఎందుకయిందో, దాని మీద గీతలెలా వచ్చాయో వారికి అర్థం కాలేదు. కొంత కాలం తర్వాత తాడుకి రాయిని కట్టి గోతిలోకి దింపారు. మళ్ళీ అదే అనుభవం పునరావృతమయింది. రాయి పైకి రాలేదు కానీ తాడు మాత్రం పీలిక లు పీలికలైపోయింది. దాంతో ఆ గోతిలో ఏదో దుష్టశక్తి ఉందన్న ప్రచారం మొదలైంది.

ఈ గొయ్యి రహస్యం తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వస్తువులన్నీ దెబ్బతింటుండటంతో జంతువుల్ని పంపారు. లోపలికి పంపిన జంతువులేవీ కూడా ప్రాణాలతో తిరిగి రాలేదు.దాంతో ఆ గొయ్యికి మృత్యుబిలం అని పేరొచ్చేసింది. ఇప్పటికీ ఆ గొయ్యి రహస్యం ఏమిటో వెల్లడికాలేదు. ఇదిలా ఉండగా, మన దేశంలో కూడా ఇలాంటి వింత బిలం ఉంది. మిస్సోరీలోని హన్నిబాట్‌లో ఉన్న ఈ బిలంలోకి వెళ్ళినవారు జుట్టు తెల్లబడిపోయి పిచ్చివాళ్ళై బయటకు వచ్చారు. అలా ఎందుకు జరుగుతోందో ఎవరికీ అర్థం కావడం లేదు.

**- కలపర్తి**

## మిమిక్రీ పక్షులు

మనం సినిమా హీరోల గొంతుకలను అనుసరించి వారిలా మాట్లాడి మనల్ని మంత్రముగ్ధులను చేసే మిమిక్రీ ఆర్టిస్టులను చూస్తుంటాం. కానీ! దక్షిణ అమెరికాలోని ఎక్కువగా కనిపించే "స్టార్ట్ వింగ్స్" అనబడే పక్షులు కూడా గొప్ప మిమిక్రీ ఆర్టిస్టు లేనని చెప్పవచ్చు. రెండువందలకు పైగా ఇతర పక్షుల అరుపులను ఇవి చక్కగా అనుకరించగలవు. పిచ్చుక గొంతుతో 'కిచ...కిచ...' మనగలవు. కాకి గొంతులా 'కావ్... కావ్'మనగలవు. కోయిలలా శ్రావ్యంగానూ... రాగాలాపన చేసి, చిలుకల్లా ముద్దు పలుకులు పలక గలగటం ఈ పక్షుల ప్రత్యేకత.

**-రమణ**

---

**(9వ పేజీ తరువాయి)**

ఆరుగురు విద్యార్థులతో వంశీ ఇంట్లో చిన్న ట్యూషన్ సెంటర్‌గా ప్రారంభమైన చిరు సంస్థ రెండేళ్ళలో చిన్నారులకే కాదు, మరెందరికో కళాకేంద్రమైంది!

- తెలుగు ప్రాథమిక దశ నుండి సాహిత్యాధ్యయనం వరకు
- సంస్కృతం ప్రాథమిక స్థాయి నుండి కావ్యాధ్యయనం వరకు
- సంగీతం
- నాట్యం
- చిత్రలేఖనం

వంటి కోర్సులతో స్వంత బిల్డింగులను సమకూర్చుకుని ఐదువేల మంది విద్యార్థులతో, రెండు వందల ఏభై మంది బోధనా నిపుణులతో తెలుగుదనపు పరిమళాలను వెదజల్లుతోంది!

ఈ నాడు పార్వతమ్మ గురించి వ్రాయని పత్రిక లేదు!

ఆమెని పరిచయం చేయని ఛానల్ లేదు!

'ఇంత స్థాయికి పార్వతమ్మ ఎదగడానికి ప్రేరణ ఎవరు?' విలేఖర్లు ఈ ప్రశ్న వేసినపుడు ఆమె ప్రశాంతంగా చెప్పింది సమాధానం.

"నా కొడుకు, కోడలు!"

★ ★ ★

పార్వతమ్మ వీలైనప్పుడు కొడుకు ఇంటికి వెళ్ళి వస్తోంది! మనుమలతో గడిపి వస్తోంది. ఏనాడూ పిల్లల చదువుల ప్రస్తావన తీసుకురాలేదు. ఎందరికో నేర్పుకొస్తూ తన సొంత మనుమలకి నేర్పలేకపోతున్నానన్న బాధని ఆమె అణచుకుంటూనే వుంది.

★ ★ ★

'టీచర్ మీరు అనుకున్నది సాధించారు' ఫోన్లో అన్నాడు వంశీ. 'నాదేముంది నాన్నా! డాలర్స్‌ని నువ్వు తెచ్చావు! మాస్టారి ఋణం తీర్చుకున్నావు!' అంది పార్వతమ్మ తృప్తిగా.

'స్కాలర్స్‌ని మీరు తయారుచేశారు టీచర్. ఇక్కడున్న ప్రతీ తెలుగువాడు మనకి డొనేషన్స్ ఇచ్చి ఈ యజ్ఞంలో పాలుపంచుకున్నారు! అందుకే ఇన్ని లక్షల డాలర్లు తేగలిగాను. ఇందులో నా గొప్పేం లేదు.'

'మనందరం పనిచేసింది మాస్టారి ఆశయం గురించే...'

'చదువులు పాడవకుండా ఖాళీ సమయంలో నేర్చుకునేలా టైమింగ్స్‌ని, సిలబస్‌ని, స్టాఫ్ మొబలైజేషన్ వంటి ఎన్నో విషయాలలో మీ ప్రణఆళిక ఈ సక్సెస్‌కి కారణం.'

'ఎన్ని చేసినా మన తెలుగు దేశంలో తెలుగు క్షీణించిపోతోందని విదేశీ వ్యామోహం పెరుగుతోందని బాధగా ఉంది.'

'మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్వతీ టీచర్‌కి పనిపడబతున్నదేమో!' నవ్వాడు వంశీ.

పార్వతమ్మ కూడా నవ్వింది.

'కానీ టీచర్ ఈ వయసులో ఇంత ఘన- విజయాన్ని సాధించారు. యూ ఆర్ గ్రేట్.

'పిచ్చి నాన్నా! స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ దిగే నాటికి ఆయన వయస్సు ఎంతో తెలుసా? ఏభై దాటింది. ఏభై రెండులో గొప్పగా. నేనేం చేసాను? దేశ స్వాతంత్ర్యం సాధించిన ఆ మహానుభావుడి ముందు ప్రపంచంలో ఎవరేం సాధించినా చిన్న పనే!

★ ★ ★

ఆరోజు పార్వతమ్మ ఒక సాంస్కృతిక సంస్థ కార్యక్రమంలో అతిథిగా పాల్గొంది. ముగ్గురు పాపలు చాలా బాగా నృత్యం చేసారు. వారిని అభినందించడానికి పిలిస్తే ఒక పాప 'నానమ్మా' అంటూ వచ్చి కౌగిలించుకునేసరికి ఆశ్చర్యపోయింది పార్వతమ్మ. మేకప్‌లో గుర్తుపట్టలేదురా మనూ అంటూ ముద్దాడింది.

తర్వాత సంజు, ఆ వెంట కొడుకు, స్వప్న, వంశీ వచ్చి కలిసారు.

'మనూ ఎంత బాగా చేసిందిరా! నాతో ఒక్క మాట చెప్పలేదేంరా?'

'కావాలనే చెప్పలేదు. చేసిన తప్పుని సరిదిద్దుకున్నాం అత్తయ్యా' అని కోడలు అంటూంటే సంబరపడిపోయింది పార్వతమ్మ.

'టీచర్! మనకి ఎక్కువ డొనేషన్ ఇచ్చిందెవరో నేను చెప్పలేదు కావాలనే! ఇప్పుడు చెప్పనా?' అని అన్నాడు నవ్వుతూ వంశీ.

'నా కొడుకని అర్థం అయింది నాన్నా! నీ ప్రశ్నలోనే ఉందిగా జవాబు' అంది పార్వతమ్మ.

"మాతృ దేవోభవ!

పితృ దేవోభవ!!

ఆచార్య దేవోభవ!!

తెలుగు దేవోభవ!!" అంటూ సంజూ నానమ్మ ఒడిలో చేరాడు.

'ఎవరు నేర్పేరురా' అని పార్వతమ్మ అడిగింది.

'ముందుంది మీ అబ్బాయి నేర్పితే... తెలుగు దేవోభవ' అని మీ మనుమడు చేర్చుకుని చెప్తున్నాడు' అంది స్వప్న.

★